
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0, కనిష్ఠం 15.7







షీ టీం బృందం సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

## నిర్భయంగా విధులు నిర్వహించాలి

● జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 3: సమర్థవంతంగా, ఎటువంటి భయాందోళనలు లేకుండా నిర్భయంగా షీ టీం బృందాలు విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్పీ షీ టీం బృందంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రెండు షీ టీం బృందాలు విధులు నిర్వహిస్తున్నాయని, గత సంవత్సరం విధులలో భాగంగా 438 అవగాహన కార్యక్రమాల ద్వారా 55,920 మంది విద్యార్థులు, ప్రజలలో చైతన్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా 97 కౌన్సిలింగ్‌ల ద్వారా, 16 ఎఫ్‌ఐఆర్ కేసులు, 86 పీటీ కేసులను నమోదు చేసి జిల్లావ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ యేడు ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, జాతరలలో విద్యార్థులు, ప్రజలకు మత్తు పదార్థాల నివారణ, సైబర్ క్రైమ్ నేరస్థులు వినియోగిస్తున్న నూతన పద్ధతులపై సామాజిక మాధ్యమాల ద్వారా చిన్న పిల్లలు, యువతులు మోసపోతున్న తీరును ప్రజలకు తెలియజేసి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్ జి, సీఐ రవీందర్, సీసీ దుర్గం శ్రీనివాస్, షీ టీం సిబ్బంది వినోద్, మహిళా హెడ్ కానిస్టేబుళ్లు వాణిశ్రీ, సుశీల, సత్యమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ బదిలీ.. కొత్త ఎస్పీగా గౌష్ అలం



జిల్లా నూతన ఎస్పీ గౌష్ అలం

**ఆదిలాబాద్ అర్బన్:** జిల్లా ఎస్పీని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం దీనికి సంబంధిత ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ములుగు జిల్లా ఎస్పీగా పని చేస్తున్న గౌష్ అలంను జిల్లా ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఉదయ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ (ఎస్పీ)గా నియమించారు.



# బీఆర్‌ఎస్.. ఖాళీ!

- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత భారీగా మార్పులు, చేర్పులు
- బీఆర్‌ఎస్ పార్టీని వీడిన జడ్పీ, డీసీసీబీ చైర్మన్‌లు
- అధికారం కోల్పోవడంతో తలోదిక్కు
- పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్
- గులాబీ పార్టీ నేతల చేరికపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
- జిల్లావ్యాప్తంగా వేగంగా మారిపోతున్న రాజకీయాలు

ఆదిలాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లా రాజకీయాల్లో భారీతిగా మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, తాంసి పీఏసీఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మరికొంత మంది ముఖ్యనేతలు బీఆర్ఎస్ పార్టీకి షాకిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. గత కొన్నాళ్లుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. త్వరలోనే పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సొసైటీ చైర్మన్లు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని తెలుస్తుంది. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. ఇటీవల జరిగి న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి పాలై మూడవ స్థానంతోనే సరిపెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కనిపించిన జిల్లాలో మాత్రం ఆ పార్టీ ప్రభా వం కనిపించ లేదు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నట్లు తెలుస్తుంది. జడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్‌లు ఇద్దరు పార్టీని వీడడంతో జిల్లాలో బీఆర్ ఎస్‌కు గట్టి దెబ్బ తగిలిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నకు అత్యంత సన్నిహితులుగా పేరున్న అడ్డి భోజారెడ్డి, రాథోడ్ జనార్ధన్‌లు పార్టీని వీడడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలు చైర్మన్ పదవుల్లోనే కొనసాగుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వెళ్తే రాజకీయ భవిష్యత్తు ఉండదన్న ఉద్దేశంతోనే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌కు చెయ్యి అందించినట్లు చెబుతున్నారు. అయితే ఇద్దరు చైర్మన్‌లు కారు దిగి హస్తం గూటికి చేరడం ఖాయమని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. కాంగ్రెస్ పార్టీలో చేరికలతో జిల్లా రాజకీయాలు రోజురోజుకూ వేగంగా మారిపోతున్నాయి.

### కాంగ్రెస్‌కు టచ్‌లో మరికొందరు

వరుసగా రెండు సార్లు అధికారాన్ని చేపట్టిన బీఆర్‌ఎస్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ పార్టీ నేతలు పక్కచూపులు చూస్తున్నారు. ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు.



● జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్



● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ ఐదేళ్లు గడవక ముందే పార్టీని వీడడం చర్చనీయాంశంగా మారింది. ఆయన బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పడంతో జడ్పీలో బీఆర్‌ఎస్ సభ్యుల సంఖ్య ఏడుకు చేరింది. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన జాన్సన్‌నాయక్‌తో గత కొద్ది రోజులుగా జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్‌కు విభేదాలు తలెత్త డంతో ఆయన పార్టీని వీడారన్న ప్రచారం జరుగుతుంది. అయిన జడ్పీచైర్మన్ పదవికి ఎలాంటి డోకా లేదనే తెలుస్తుంది. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పదవి కాలం మరో 13 నెలల పాటు ఉండడంతో ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో అధికార పార్టీతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బోథ్ నియోజక వర్గంలో బీఆర్ ఎస్ పార్టీ గెలిచిన అధికారం లేక పోవడంతో నేతలు నిరాశతోనే కనిపిస్తున్నారు. గెలిచిన ఏం లాభం అధికారం లేదంటూ బహిరంగంగానే ఆ పార్టీ నేతలు మాట్లాడుకోవడం కనిపిస్తుంది. ఆదిలాబాద్‌లో బీజేపీ గెలిచిన బీఆర్ ఎస్ నేతలు మాత్రం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్ల వరకు వేచిచూసే ఓపిక లేక ప్రత్యామ్నయ మార్గాలను వెతుక్కుంటున్నారు. కొంతమంది నేతలు పరువు, ప్రతిష్టలకు పోగా.. మరికొందరు అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. జిల్లాలో కొంతమంది బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. నామినెట్ పదవులే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ఆశావహ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

### కీలక నేతలే టార్గెట్

అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలపై ముందుచూపుతో ముందుకెళ్తనట్లు తెలుస్తుంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే చేరికలపై ప్రత్యేకదృష్టిని సారిస్తుంది. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల కీలక నేతలను టార్గెట్ చేస్తూ పార్టీలో చేర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ముఖ్యంగా బీఆర్‌ఎసే టార్గెట్‌గా కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. అవిశ్వాసాన్ని ఆయుధంగా చేసుకుంటున్న కాంగ్రెస్ కీలక పదవుల్లో కొనసాగుతున్న బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీ, జడ్పీ, సొసైటీ చైర్మన్లపై వేటు వేసే ప్రయత్నం చేస్తోంది. దీంతో బీఆర్‌ఎస్ నేతలు దిగిరాక తప్పడం లేదంటున్నారు. బీఆర్‌ఎస్ నేతల మద్దతును కూడగట్టి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అన్ని రకాల ప్రయత్నాలను మొదలు పెట్టింది. కొందరికి నామినెట్ పదవులను ఎరవేసేందుకు కూడా సిద్ధమవుతోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యతను ఇస్తామని చెప్పడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు నేతలు సిద్ధమవుతున్నారు. త్వరలోనే జిల్లాస్థాయిలో భారీ చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

### బీఆర్‌ఎస్ అలర్ట్

జిల్లాలో ఇద్దరు చైర్మన్లు పార్టీ మారడంతో బీఆర్‌ఎస్ మరింత అప్రమత్తమైంది. బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి ముఖ్య నేతల సన్నాహక సమావేశం జరిగిన రోజే.. ఈ ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయినా.. నేతలు కండువాలు మార్చేయడంతో జిల్లా రాజకీయం హీటెక్కుతోంది. ఇటీవల డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో చైర్మన్ పదవికి కూడా రాజీనామా చేయాలని ఆ పార్టీ నేతలు పట్టుబట్టారు. ఆయన బాటలోనే జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ వెళ్లడంతో ఆయనపై కూడా బీఆర్‌ఎస్‌లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అడ్డిభోజారెడ్డిని డీసీసీబీ పదవి నుంచి తొలగించేందుకు బీఆర్‌ఎస్ నేతలు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. కాని ఆయనపై అవిశ్వాసం పెట్టేందుకు మరో 13 మాసాల పాటు సమయం ఉండడంతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తుంది. అలాగే జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ విషయంలోనూ నేరడిగొండ జడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నిక జరిగితేనే ఆయనపై అవిశ్వాసానికి అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ పార్టీ నేతలను కట్టడి చేసే విషయంలో ఏమీ చేయలేక పోతోందనే టాక్ వినిపిస్తోంది.

## మహాలక్ష్మి పథకంతో ఇబ్బందులు

● సమ్మెకు వెళ్తామంటూ అద్దెబస్సు యజమానుల నోటీసు

ఉట్నూర్, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ అద్దె బస్సులకు అదనపు భారం పడిందని, అద్దె బస్సుల యజమానుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామంటూ ఉట్నూర్ డిపో పరిధిలోని అద్దె బస్సుల యజమానులు సమ్మె నోటీసు అందించారు. బుధవారం ఉట్నూర్ డిపో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జనార్ధన్‌కు ఈ మేరకు నోటీసును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 60 మంది ప్రయాణికులను తరలించే బస్సులలో రెండింతల మంది ప్రయాణిస్తున్నారని, తద్వారా అనుకొని సంఘటనలు జరిగితే తమ డ్రైవర్లపై తమపై కేసులు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలోని కొన్ని డిపోలలో ఏసీ, లగ్జరీ బస్సులు మినహాయించి కార్పొరేషన్ ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు అద్దె బస్సుల కన్నా తక్కువగా ఉన్నాయని, ప్రస్తుతం ప్రయాణికుల భారం అద్దె బస్సుల పైన 60 శాతం వరకు పెరిగిందన్నారు. ప్రతీ బస్సు దాని ఇన్‌కమింగ్ సమయాని కన్నా రెండు, మూడు గంటలు ఆలస్యంగా వస్తోందని, టికెట్లు ఇవ్వ్య చాలా సమస్యగా ఉన్నదని, బస్సు నడిపే డ్రైవర్ల పైన బస్సు యొక్క రోజు వారి మెయింటెనెన్స్ పైన అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. ఇందులో యజమానుల సంక్షేమ సంఘం నాయకులు గుగులవాత్ శ్రీరామ్, రమణారెడ్డి, తిరుపతి రెడ్డి, భాస్కర్ రెడ్డి, సంజీవరెడ్డి, రామినికృష్ణ, కృష్ణారెడ్డి, హుస్సేన్‌చౌష్, తదితరులున్నారు.



ఉట్నూర్‌లో సమ్మె నోటీసు ఇస్తున్న అద్దె బస్సుల యజమానులు

## సంక్షిప్త సమాచారం



కన్నాపూర్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీవో

### రేషన్ కోసం భారీగా దరఖాస్తులు

ఉట్నూర్, జనవరి 3: గత దశాబ్దా కాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన గ్రామసభలలో రేషన్ కార్డులు ఇవ్వాలంటూ భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. బుధవారం మండలంలోని కన్నాపూర్‌లో సర్పంచ్ జుగాదిరావు అధ్యక్షతన ప్రారంభించిన గ్రామసభలో ప్రజలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం ఈనెల ఐదు వరకే కార్యక్రమాన్ని కుదించినందున.. ప్రతీరోజు మూడు గ్రామ పంచాయతీల వారిగా గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీవో మహేశ్‌కుమార్ తెలిపారు. కాగా లక్కేటిపేట, ఉమ్రిలలో ఎంపీడీవో బోడ తిరుమల ఆధ్వర్యంలో, నడంగూడ చాందూరిలలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. చాందూరి సర్పంచ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

### నేడు తాంసిలో గ్రామపాలన సభ

తాంసి, జనవరి 3: ప్రజాపాలన గ్రామసభను గురువారం తాంసి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భూమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభను ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక పాత జిల్లా పరిషత్ పాఠశాల ఆవ రణలో ఏర్పాటు చేస్తున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బోథ్, జనవరి 3:మండలంలోని పార్డీ (బి) దేవల నాయక్ తండా గ్రామంలో బుధవారం జగదాంబ దేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో చుట్టూ పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా జగదాంబ దేవి ఆలయంలో అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బలరాం జాదవ్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం నిర్వహించే జాతర ఏడాది కేడాది ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్థులంతా ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి భక్తులు తరలివచ్చారు.

### విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, జనవరి 3: జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెరకిరణ్ అన్నారు. బుధవారం ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచాలన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు వివరించామన్నారు. ఆయన వెంట సక్కు, నగేష్‌లున్నారు.

# నాలుగు రోజుల్లో లక్ష దరఖాస్తులు

● బ్రాహ్మణవాడ ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ● అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ పరిశీలన



పట్టణంలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



పొన్నారి గ్రామసభలో లబ్ధిదారుల ఫారాలను పరిశీలిస్తూ..

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 3: జిల్లాలో గత నాలుగు రోజుల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో లక్షకు పైగా దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బ్రాహ్మణవాడలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లడుతూ ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత నాలుగు రోజుల్లో లక్షకుపైగా దరఖాస్తులు రావడం జరిగిందని, ఇది నిరంతర ప్రక్రియని అన్నారు. గ్రామ, వార్డు సభలలో షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల స్వీకరణ చేపట్టడం జరుగుతుందని, ఆ రోజు దరఖాస్తు సమర్పించని వారు మరుసటి రోజు ఆ తర్వాత రోజైన సంబంధిత అధికారులకు అందివచ్చని తెలిపారు. రేషన్‌కార్డు లేని వారు కాలంలో లేదని, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేసి సమర్పించాలని సూచించారు. అవసరమైన కౌంటర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ శైలజ, సీపీఓ వెంకటరమణ, ఎంపీడీఓ భూమయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, దరఖాస్తుదారులు, సిబ్బందితి, తదతరపాల్గొన్నారు.

● సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందేలా చూడాలి

**తాంసి:** రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు సక్రమంగా అందించేందుకే ప్రజా పాలన కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభను సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అందుబాటులో ఫారాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పేదలను గుర్తించి ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల చేయూత పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లు, జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ కార్డులు ఇప్పటి వరకు అందిన దరఖాస్తుల వివరాలను తెలిపారు. ప్రతీఒక్కరి దరఖాస్తును స్వీకరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, ఎంపీడీవో భూమయ్య, ఎంపీటీసీ ముచ్చ రేఖ, రఘు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

● గిరిజనుల అభివృద్ధి కోసం పీఎం జన్‌మన్ యోజన పథకం

**ఆదిలాబాద్ అర్బన్:** మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ (పీఎం జన్‌మన్ యోజన) పథకం ప్రవేశ పెట్టిందని కలెక్టర్ రాహుల్‌రాజ్‌పీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం జన్‌మన్ యోజన పథకం అమలుపై గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ బి.శివనంద్, ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయిలతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన తెగల్లో అత్యంత వెనుకబడిన తెగలున్నాయని, వారందరి అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ యోజన పథకాన్ని ప్రారంభించారన్నారు. జిల్లాలోని పీవీటీజీ అవాసాల్లో వివిధ పథకాలను మిసన్ మోడ్‌లో పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 202-24 నుంచి 2025-26 వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కేంద్రం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా, శ్యామలదేవి, జిల్లా అటవి అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరేందర్‌రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● పంట రుణాల మంజూరుపై కమిటీకి సిఫార్సు

**ఆదిలాబాద్ అర్బన్:** పంటల దిగుబడి ఆధారంగా రైతులకు అందించే రుణాల పై చర్చించి రాష్ట్ర స్థాయి కమిటీకి సిఫార్సు చేయడం జరుగుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వచ్చే ఆర్థిక సంవత్సరం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పై అనుసరించాల్సిన అంశాల పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు గిరిజన విద్యార్థులు

ఉట్నూర్, జనవరి 3: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం కిన్నెరసానిలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా ఉత్సవాలకు జిల్లా గిరిజన క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణం నుంచి బస్సులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఈనెల 6వరకు జరుగనున్న క్రీడా పోటీలకు 250మంది క్రీడాకారులు, 26 మంది అధికారులు, కోచ్‌లు, మేనేజర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు తరలి వెళ్లారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, అర్చరీ, టెన్నికాయిట్, చెస్, క్యారం క్రీడా పోటీల్లో విజయం సాధించి రావాలని కోరారు. ఇందులో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా క్రీడా అధికారులు కోరెడ్డి పార్థసారథి, భుక్యరమేష్, హెచ్‌ఎంలు చందన్, ఉత్తం, ఏటీడీవో క్రాంతికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు హేమంత్‌నాయక్, విశ్వనాథ్, మధుసూదన్, కోచ్లు సునంద్, లక్ష్మీరాం స్వప్న, సునిత, తదితరులు పాల్గొన్నారు.

## దినసరి ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు పెంచాలి

ఉట్నూర్, జనవరి 3: ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరుతూ సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయికి వినతిపత్రం సమర్పించారు. 2022లో పెంచిన వేతనాలే కొనసాగిస్తున్నారని, బీద ఉద్యోగులైన దినసరి ఉద్యోగులు చాలి చాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. ఈ విషమై పరిశీలిస్తామని పీవో వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కేబీసీ నారాయణ,జిల్లా అధ్యక్షుడు షౌకత్‌హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వినయ్, అశోక్, రాంబాయి, నితిన్, బాలాజీ, సోనేరావు, ఈరమ్మ, చందు, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న దినసరి ఉద్యోగులు

# తాంసికి చేరిన అయోధ్య రాములోరి అక్షింతలు



గోటుకూరిలో స్వాగతం పలుకుతున్న మహిళలు



కూరలో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాంసి, జనవరి 3: అయోధ్య శ్రీరామ మందిరం ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన అక్షింతలు తాంసి మండలంలోని గోటుకూరికి బుధవారం చేరుకున్నాయి. కాగా ప్రత్యేక పూజల అనంతరం మండలంలోని 16 గ్రామాలకు అక్షింతలు, రామ మందిర ఫోటో, కరపత్రాలు అందజేశారు. రాములోరి అక్షింతలు గ్రామంలోకి రావడంతో ఆయా గ్రామాల్లోని మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్నారు. గడపగడపకు తిరుగుతూ అక్షింతల యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. 22న బాలరాముడి నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఉంటుందని, ఈ సందర్భంగా ఇళ్లల్లో దీపాలు వెలిగించి ఆలయాల్లో భజనలు, సంకీర్తనలు నిర్వహించాలని సూచించారు.

**జైనథ్:** దేశంలో ఈనెల అయోధ్యలో శ్రీరాముడి ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలతో బుధవారం జైనథ్ మండలంలోని కూర గ్రామంలో డప్పుల భజాలతో పాటు భజనల మధ్య నగరసంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరాముని ఉత్సవ విగ్రహాలను పలు విధుల గుండా శోభాయాత్రను నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయోధ్య రాముని అక్షింతలను ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ జన్మభూమి భక్తులు అడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అల్లూరి వెంకట్‌రెడ్డి, కిసాన్ మోర్చా జైనథ్ మండల అధ్యక్షుడు ఏనుగు రాకేష్‌రెడ్డి, నాయకులు సిడాం రాకేష్, దశరథ్ స్వామి, సంజీవరెడ్డి, దశరథ్, స్వామి, కిష్టన్న, అశోక్‌లతో పాటు కూర గ్రామ ప్రజలు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.






# అర్హులకు సంక్షేమ పథకాలు అందే వరకు అండగా ఉంటాం

● ఏలేటి మహేశ్వర్ రెడ్డి

లక్ష్మణచాంద, జనవరి 3 : అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందే వరకు అండగా ఉంటామని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో జరుగుతున్న ప్రజా పాలన కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. అంతకుముందు బాబాపూర్ గ్రామంలో నిర్వహించబడుతున్న మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నారు. అందుకోసం నేను ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, సర్పంచ్ కొమ్ము శ్రీవిద్య, కాయిటి లలితా జీవన్‌రెడ్డి, లక్ష్మణచాంద సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, తదితరులున్నారు.


నర్సాపూర్(డబ్ల్యూ) ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
















చింతకుంటలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీవో

## కొనసాగుతున్న ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ

ముథోల్, జనవరి 3 : మండలంలోని చింతకుంట, వడ్తాల్, రువ్వి, గన్నోర గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి బుధవారం ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించారు. ప్రత్యేక అధికారి సుదర్శన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ అతికొద్దిన్, ఏపీవో శిరీషరెడ్డి, సర్పంచ్ రాజేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, ఏఈవోలు, ఆర్ఐ నారాయణ, ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ సిబ్బంది, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





















నిర్మల్‌లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## వైద్య సేవలు ప్రజలకు చేరువ కావాలి

● ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : వైద్య సేవలు ప్రజలకు చేరువకావాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన దేవిబాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రులు సేవాభావంతో పని చేయాలన్నారు. డాక్టర్లు అవినాష్, చంద్రిక అవినాష్, రామచంద్రారెడ్డి, రణీత్, మనోజ్, ప్రశాంత్, శ్రీకాంత్, బీఎల్ నర్సింహారెడ్డి, అమరేశ్వర్, రవి, రత్నాకర్ పాల్గొన్నారు.


విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

## ఘనంగా బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ

ముథోల్, జనవరి 3 : మండలంలోని విట్టోలి గ్రామంలో గ్రామ వీరశైవ లింగా యూత్ సంఘం ఆధ్వర్యంలో రాజేశ్వర శివలింగ్ శివాచార్య మహరాజ్ అహ్మద్‌పూర్ స్వహస్తాల మీదుగా బుధవారం మహాత్మా బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ముథోల్ శాసనసభ సభ్యులు పవార్ రామారావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 12వ శతాబ్దపు విప్లవకారులలో బసవేశ్వరుడు ఒకరని, మనుషులంతా ఒక్కటేనని, శివుడే సత్యం అని నమ్మిన సిద్ధాంతకర్త అని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మోహన్ రావు పటేల్, సర్పంచ్ సత్తయ్య గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జి తాటివార్ రమేష్, వీరశైవలింగా యూత్ సంఘ సభ్యులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


కుభీర్‌లో అయోధ్య రామజన్మభూమి పూజిత అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

## అయోధ్య రామజన్మభూమి పూజిత అక్షింతల పంపిణీ

కుభీర్, జనవరి 3 : మండల కేంద్రం కుభీర్‌లో బుధవారం అయోధ్య ట్రస్ట్ క్షేత్రం ఆధ్వర్యంలో రామ జన్మభూమి పూజిత అక్షింతలు పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో ఇంటింటా తిరుగుతూ ప్రతీ ఇంటికి అక్షింతలను పంపిణీ చేశారు.












# మహిళా హక్కుల ఉద్యమ కెరటం సావిత్రీబాయి పూలే

● మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీష్‌కుమార్ ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు

ఇంద్రవెల్లి, జనవరి 3: మహిళా హక్కుల ఉద్యమ కెరటం సావిత్రీబాయి పూలే అని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన ఆవరణలో గొప్ప సంఘ సంస్కర్త మహిళ లోకానికి చదువులు నేర్పించిన చదువుల తల్లి సావిత్రీబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకుని సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరత్వాగ్ సందీప్, నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖాడే ఉత్తమ్, తదితరులు ఉన్నారు.

**ఉట్నూర్:** ఓ అక్షర దీపమా అణగారిన మహిళల ఆరాధ్యమా అడుగడుగునా అవమానాలు ఎన్నో భరించి అవమానాలను అభివృద్ధికి సోపానాలుగా మలిచి చదువుల తల్లిపై వెలిసి భారత మొదటి మహిళ ఉపాధ్యాయురాలివై నిలిచిన నీ ఘనత అనిర్వచనీయమైనదని ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు కనుకసుగుణ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అమ్మ సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనక సుగుణ మాట్లాడుతూ బడుగు బలహీన, అణగారిన, సబ్బండ వర్గ మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన త్యాగం చారిత్రాత్మకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.ఇదిలా ఉండగా ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో తెలంగాణ స్టేట్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రజ్ఞశీల్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సుమలతకు పూలే చిత్రపటాన్ని బహూకరించారు. ఇందులో నాయకులు దుర్వ మహేశ్, దావుల రమేష్, భుజంగరావు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

● 'అణగారిన వర్గాల అక్షర జ్యోతి'

**జైనథ్:** దేశంలో అణగారిన వర్గాల అక్షరజ్యోతి సావిత్రీబాయి పూలే అని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు పెంటపర్తి ఊశన్న మేడిగూడ ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సత్యవాన్‌చిక్టె అన్నారు. బుధవారం జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండలంలోని మేడిగూడ ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ ఆర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొనిగెల నారాయణలతో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● 'మహోన్నత శిఖరం సావిత్రీ బాయి'

**తలమడుగు:** సావిత్రీ బాయిపూలే జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు



మేడిగూడలో సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తెలుసుకోవాలని సామాజిక కార్యకర్త బ్లూ భీమ్‌యూత్ అధ్యక్షుడు గొంటిముక్కుల ప్రేమేందర్ అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే 193వ జయంతి వేడుకలను బ్లూ భీమ్ య ఊత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూల అర్పిస్తూ ఘనంగా జయంతి వేడుకలు జరుపుకున్నారు. తలమడుగు మండల కేంద్రంలో గల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు స్పీచ్‌లు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థులకు బ్లూ భీమ్ యూత్ సభ్యులు బహుమతులను అందజేశారు. సామాజిక కార్యకర్త, బ్లూ భీమ్ యూత్ అధ్యక్షుడు ప్రేమేందర్ మాట్లాడుతూ మన దేశ మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు గొప్ప సంఘ సంస్కర్త మహిళ హక్కుల యోధురాలు ఎన్నో కష్టాలని ఎ దుర్కొని బాలికల విద్యకు పూలబాటలు వేసి ఎంతో మంది మహిళలు ఈ రోజు స్వేచ్ఛగా మగవాళ్లతో సమానంగా ఉన్నత శిఖరాలలో అదిరోహించారంటే సావిత్రిబాయి కృషి వల్యాన్ని ఆమెను ఎప్పటికి మరువద్దని ప్రతి ఒక్కరు పూలేల చరిత్రను తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లూ భీమ్ యూత్ అధ్యక్షులు జి.ప్రేమేందర్, ఎంపీటీసీ ఎలుగు రాజన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ నేతుల గంగన్న, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు, దిలీప్, వసీం, నిఖిల్‌రెడ్డి, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, లలితరెడ్డి, రాజేందర్, సుమలత, యూత్ సభ్యులుశేఖర్, ప్రశాంత్‌రాజు, సందీప్, జైపాల్, వంశీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**భీంపూర్:** మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రి బాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్ష, అంటరానితనం,



ఇంద్రవెల్లిలో పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సతీసహగమనం, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలను ప్రజలకు చైతన్యపరచాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కెమ కళ్యాణి గంగయ్య, ప్రధాన ఉపాధ్యాయుడు వైద్య మహేష్, ఉపాధ్యాయులు గంపల ప్రభాకర్, మధుసూధన్, శ్రీనివాస్, రమేష్, వీర కుమార్, శంకర్, సంధ్యారాణి, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**తాంసి:** మండలకేంద్రంలో మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పూలే దంపతుల చిత్ర పటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాలి సంఘం యువజన నాయకుడు కోట్రాంగ్ అశోక్ మాట్లాడుతూ అంధకార భారతవనిలో మెరిసిన వేగుచుక్క సావిత్రిబాయి పూలే అనికొనియాడారు. ఆమె బాలిక విద్యను ప్రోత్సహించి సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపడానికి కృషి చేసిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● 'గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రీబాయి పూలే'

**బోథ్:** ఉపాధ్యాయురాలిగా కాకుండా సంఘ సేవకురాలిగా సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్తగా నిలిచిపోయారని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరు ప్రఖ్యాతలు గాంచారన్నారు. కుల మతాలకతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. 1848లో జనవరి 1వ తేదీన తన భర్తతో కలిసి పూణేలో బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే సావిత్రిబాయి చూపించిన మార్గమే అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, జూనియర్ వైస్‌ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు జ్యోతి, శైలజ, భాగ్యశ్రీ, హారిక, కిరణ్ లింగంపల్లి సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.



జైనథ్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

## ఎన్నికల హామీలన్నింటినీ నెరవేర్చాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్, జనవరి 3: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరిచండంలో అధికారులు, నాయకులు ప్రజలతో మమేకమయి పరిష్కరించాలన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.దేవన్న, ఉప సర్పంచ్ టి.రాకేష్‌రెడ్డి, ఎంపీటీసీ కె.సుదర్శన్, డీపీవో పి. శ్రీనివాస్, ఎంపీడీవో గజానన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలి

**మావల:** ప్రజాపాలన దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అదేవిధంగా అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, అధికారులు, బీజేపీ నాయకులు బక్కి స్వామి యాదవ్, మద్దికుంట్ల మల్లేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రజాపాలనలో ఇబ్బందులు లేకుండా చూడాలి'

**సిరికొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతీష్మాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలనలో అభయహస్తం గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంపీడీవో సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని నారాయణ్‌పూర్, నేరడిగొండ(జి) గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాల్లో అభయహస్తం గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఈ కార్యక్రమంలో దరఖాస్తు ఫారాలను స్థానిక పంచాయతీ కార్యదర్శుల ద్వారా ప్రజలకు ఉచితంగా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అర్క జగన్, ఉయిక ఈశ్వరిబాయి సీతారాం, ఎంపీటీసీ, కార్యదర్శులు చక్రవర్తి, వినాయక్ పాల్గొన్నారు.

● 'ప్రజల సంక్షేమం కోసమే ప్రజాపాలన'

**తలమడుగు:** ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం ప్రజాపాలన ప్రారంభించిందని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గజ్జల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి అభయహస్తం పథకాలు అందించేందుకు ప్రభుత్వం గ్రామసభలను ఏర్పాటు చేసిందన్నారు. లబ్దిదారులు ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. కజ్జర్ల గ్రామంలో అభయహస్తం ఐదుగ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో తలమడుగు జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, తహసీల్దార్ రాజ్‌మోహన్, సర్పంచ్ మొట్టె వెంకటమ్మ, కిరణ్, ఎంపీటీసీ గోదావరి కమలాకర్, డీటీ ప్రభాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాయకులు శ్రీనివాస్, ప్రఫుల్‌రెడ్డి, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

● 'సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి'

**బోథ్:** ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ అనేక మంది రేషన్ కార్డుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ యాదవ్, ఎంపీటీసీలు మహేందర్‌తో పాటు ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి సాగు చేస్తున్న కౌలు రైతులను ఆదుకోవాలి : బొర్రన్న

బోథ్, జనవరి 3: ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగు చేస్తున్న కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బోథ్‌లో మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో 27వేల 623 మంది కౌలు రైతులు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కవులు రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. బోథ్ మార్కెట్ పరిధిలోని జిన్నింగులలో ఇప్పటివరకు ఒక లక్ష 25 వేల 435 క్వింటాల పత్తి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇందులో 35వేల 788 ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారన్నారు. దీన్ని బట్టి చూస్తే కౌలు రైతులు ప్రైవేట్ వ్యాపారులకు పంట అమ్ముకున్నారన్నారు. కౌలు రైతుకు మద్దతు ధర లభించకపోగా నష్టపోయారని పేర్కొన్నారు. కౌలు రైతులు అమ్మిన పత్తికి ప్రభుత్వం రూ.2వేలు క్వింటాల్‌కు బోనస్‌గా ఇవ్వాలని, లేకుంటే రూ.పది వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు సుధాకర్ యాదవ్, రాజేశ్వర్, అనిల్, తదితరులున్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి : డీఎస్పీ

ఇంద్రవెల్లి, జనవరి 3: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాటగూడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. గ్రామస్థులు కలిసిమెలిసి ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈనెల 5న ఎస్పీ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్సై దుబ్బాక సునీల్, గ్రామ పటేల్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

## మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 3: సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది తాంసి బస్టాండ్ వద్ద మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు షబ్బీర్, వసీంఅక్తర్, సయ్యద్ ఇక్బాల్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నా మన్నారు. వారి వద్ద నుంచి మట్కాకి సంబంధించిన రూ.2300, మట్కా చిట్టిలను, మొబైల్ ఫోన్, మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకుని వారిపై రెండవ టౌన్ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయనున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ తెలిపారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : నిర్మల్ నియోజకవర్గంలోని 109 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఎన్. ఇంద్రకరణ్‌రెడ్డి, అయ్యన్నగారి రాజేందర్, సాధం అరవింద్, అప్పాల వంశీ, భాస్కర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఖానాపూర్, జనవరి 3 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నేడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పరిమల్ భౌమిక్, డిప్యూటీ తహసీల్దార్ మంజుల తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. లబ్ధిదారులకు ఇదివరకే సమాచారం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. కాగా కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఏడుగురు, షాదీ ముబారక్ పథకం ద్వారా 9 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరు అయ్యాయని అధికారులు తెలిపారు.

### ముథోల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి

భైంసా, జనవరి 3 : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా నియోజక వర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్‌కు కేంద్ర మాజీ మంత్రి సూర్యకాంత పాటిల్ సూచించారు. బుధవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో మహారాష్ట్ర మాజీ మంత్రి మాదవరావ్, బీజేపీ ప్రతినిధులు సుహాస్ పాటిల్, డా.హింగోలే బృందం ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్‌తో ప్రత్యేకంగా బేటి అయ్యారు. నియోజక వర్గ రాజకీయ పరిస్థితులు, రాబోయే పార్లమెంట్ ఎన్నికలు తదితర వాటిపై చర్చించారు.అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు.

## బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ సమావేశానికి జాన్సన్‌నాయక్ హాజరు




తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ నియోజకవర్గం నాయకులతో జాన్సన్ నాయక్

ఖానాపూర్, జనవరి 3 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశానికి ఖానాపూర్ నియోజకవర్గం హాజరయ్యారు. ఆయనతో పాటు ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఈ సమావేశానికి హాజరైనట్లు బీఆర్‌ఎస్ శ్రేణులు ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో తెలిపాయి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ప్రణాళికలపై ఈ సమావేశంలో చర్చించినట్లు వారు పేర్కొన్నారు. కాగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఈసారి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా జాన్సన్‌నాయక్ బరిలో దిగుతారని ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశానికి జాన్సన్ నాయక్ హాజరవ్వడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు కొక్కుల ప్రదీప్, రాజ గంగన్న, నరేందర్ రెడ్డి, తదితరులున్నారు.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించాలి

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించేందుకు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ సూచించారు. బుధవారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫారంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మలేరియా వ్యాధికి సంబంధించి ఎల్, ఎస్, పీ ఫారాలను పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కోరారు. నమోదుపై డేటా మేనేజర్ ముత్యం అవగాహన కల్పించారు. డాక్టర్ రాజారమేష్, రవీందర్‌రెడ్డి, బారే రవీందర్, భోజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. హెచ్ఈవోలు, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు శిక్షణకు హాజరయ్యారు.



రైతుల దాడిలో పాక్షికంగా దెబ్బతిన్న టిప్పర్లు



మంటల్లో కాలిపోతున్న కారు

జాతీయ రహదారిపై రాస్తారోకో (ఫైల్)



ప్రహరీ గోడ కూల్చి వేత

# ఇథనాల్ కలకలం

- ఫ్యాక్టరీపై అన్నదాత కన్నెర్ర
- పచ్చని పంట పొలాలకు ముప్పు ఉందని ఆందోళనలు
- నిర్మాణాలపై దాడితో యాజమాన్యంలో దడ
- ఎప్పటికప్పుడు వ్యతిరేకించినా ఆగని వ్యవహారం
- ఆగ్రహంలో నిప్పులు చెరిగిన రైతులు

నిర్మల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పచ్చని పంట పొలాలకు నెలవైన జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వ్యవహారం చిచ్చు పెడుతోంది. దశాబ్దాల నుంచి ఈ గ్రామం వ్యవసాయంలో ముందు వరుసలో నిలుస్తోంది. వరి, మొక్కజొన్న పంటలతో పాటు కూరగాయల పంటలు, వాణిజ్య పంటలను రైతులు ఇక్కడ పెద్దఎత్తున సాగు చేస్తుంటారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ వీరు పెద్దమొత్తంలో దిగుబడులు సాధిస్తారు. ఇలాంటి పంట పొలాలను నమ్ముకొని ఆనందంగా గడుపుతున్న గుండంపెల్లి గ్రామంలో ఓ ప్రైవేటు సంస్థ ఇథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుండడం రైతుల అభ్యంతరాలకు కారణమవుతోందంటున్నారు. రైతులు ఇక్కడ ఇథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దంటూ ఎంతగా చెబుతున్నప్పటికీ యాజమాన్యం మాత్రం తన మొండి వైఖరితో ఫ్యాక్టరీని ఇక్కడే ఏర్పాటు చేస్తామని, ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఎలాంటి కాలుష్య ముప్పు ఉండదంటూ వాదిస్తోంది. పలుసార్లు ఇక్కడి రైతులు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దంటూ అటు యాజమాన్యానికి ఇటు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వారి నుంచి ఎలాంటి స్పందన కానరాకపోవడంతో ఆందోళన బాటపట్టారు. ఇటీవలదిలావర్‌పూర్ మండల కేంద్రంలో గుండంపల్లి రైతులు ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దంటూ ధర్నా చేపట్టారు. తమ ఆందోళనను ఇక దశల వారీగా ఉధృతం చేస్తామంటూ వారు హెచ్చరించారు. బుధవారం ఉదయమే ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని ఆ ఫ్యాక్టరీ ఆఫీసును అలాగే నిర్మాణ సామాగ్రిని, వాహనాలను ధ్వంసం చేశారు. రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో వారంతా నినాదాలు చేస్తూ ఫ్యాక్టరీ ఆవరణలోని సామాగ్రినంతా చెల్లాచెదురు చేశారు. కోపోద్రిక్తులైన కొంతమంది అన్నదాతలు ఏకంగా ఫ్యాక్టరీ యాజమాన్యానికి సంబందించిన ఓ కారును సైతం దగ్ధం చేశారు. దాదాపు రెండు గంటల పాటు అన్నదాతలు ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళనలు చేపట్టి హల్‌చల్ చేశారు. రైతుల ఆగ్రహానికి బెంబెలేత్తిన యాజమాన్యం ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం నుంచి మెల్లగా జారుకున్నారు.

### దాడితో యాజమాన్యంలో దడ

జిల్లాలోని దిలావర్‌పూర్ గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీపై అన్నదాత కన్నెర్ర చేశాడు. గత నెల రోజుల నుంచి ఇథనాల్ ఫ్యాక్టరీని తమ గ్రామాల వద్ద ఏర్పాటు చేయవద్దంటూ రైతులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడంతో వారంతా సీరియస్‌గా రంగంలోకి దిగారు. బుధవారం ఉదయమే ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని ఆ ఫ్యాక్టరీ ఆఫీసును అలాగే నిర్మాణ సామాగ్రిని, వాహనాలను ధ్వంసం చేశారు. రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో వారంతా నినాదాలు చేస్తూ ఫ్యాక్టరీ ఆవరణలోని సామాగ్రినంతా చెల్లాచెదురు చేశారు. కోపోద్రిక్తులైన కొంతమంది అన్నదాతలు ఏకంగా ఫ్యాక్టరీ యాజమాన్యానికి సంబంధించిన ఓ కారును సైతం దగ్ధం చేశారు. దాదాపు రెండు గంటల పాటు అన్నదాతలు ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళనలు చేపట్టి హల్‌చల్ చేశారు. రైతుల ఆగ్రహానికి బెంబెలేత్తిన యాజమాన్యం ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం నుంచి మెల్లగా జారుకున్నారు. అలాగే నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికులు సైతం భయాందోళనకు గురై తమ సొంత ఊళ్లకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. ఫ్యాక్టరీని నిర్మించాలని ప్రతిపాదించినప్పటి నుంచే ఇక్కడి రైతాంగం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చింది. అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దంటూ డిమాండ్ చేయడమే కాకుండా రైతులకు మద్దతుగా నిలిచారు. అలాగే ఇతర ప్రజా ప్రతినిధులు సైతం ఈ విషయంలో ఆశించిన మేరకు స్పందించలేదు. దీంతో ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామస్థులంతా ఓపిక పట్టారు. వారి ఓపిక, సహనం నశించిపోవడంతో బుధవారం ఫ్యాక్టరీపై దాడికి ఉపక్రమించారు. వందలాది మంది రైతులు ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం వద్దకు చేరుకొని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయినప్పటికి యాజమాన్యం వీరితో మాట్లాడేందుకు ముందుకు రాకపోవడం, సంబంధిత అధికారులు సైతం పెద్దగా స్పందించకపోవడంతో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల రైతులు ఒక్కసారిగా ఫ్యాక్టరీ ఆవరణలోకి చొచ్చుకువచ్చి అక్కడి సామాగ్రినంతా ధ్వంసం చేశారు. అలాగే ఫ్యాక్టరీ గ్లాసులను కూడా ధ్వంసం చేశారు. చివరకు యాజమాన్యానికి సంబంధించిన ఓ కారును సైతం దహనం చేసి తమ నిరసనను తెలిపారు. ఈ సంఘటన జిల్లాలో దుమారం రేపింది.

### యాజమాన్యం వాదనను తిరస్కరిస్తున్న రైతులు

హైదరాబాద్‌కు చెందిన పీఎంకె ప్రైవేటు లిమిటెడ్ అనే ఓ సంస్థ గుండంపల్లి వద్ద దాదాపు వందకోట్ల రూపాయల వ్యయంతో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రంగం సిద్ధం చేస్తుండడం స్థానికంగా దుమారం సృష్టిస్తోంది. ఇథనాల్ ఫ్యాక్టరీ ద్వారా వెలువడే కాలుష్యం తమ ఆరోగ్యాలపై ప్రభావం చూపడమే కాకుండా పలు పంట పొలాలకు కూడా నష్టం కలిగిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఇక తమ పచ్చని పొట పొలాలు కాలుష్య కొరల్లో చిక్కుకుంటాయని గతంలో మాదిరి స్వచ్ఛమైన వాతావరణం ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇతర చోట్ల స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికి యాజమాన్యం మాత్రం తమ గ్రామం వద్దనే పరిశ్రమను ఎందుకు ఏర్పాటు చేస్తుందో అంతుచిక్కడం లేదని వారు వాపోతున్నారు. పరిశ్రమల ఏర్పాటును తాము అడ్డుకుంటామని యాజమాన్యం మొండికేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామంటూ గుండంపల్లి రైతులు స్పష్టం చేస్తున్నారు.

### కాలుష్యం ఏర్పడబోదంటున్న యాజమాన్యం

గుండంపల్లి వద్ద ఏర్పాటు చేయబోతున్న ఇథనాల్ ఫ్యాక్టరీతో ఎలాంటి కాలుష్య ముప్పు ఉండదని పీఎంకె ప్రైవేటు లిమిటెడ్ సంస్థ స్పష్టం చేస్తోంది. జీరో పొల్యూషన్ పద్దతిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నామని కేవలం మొక్కజొన్న, వరితోనే ఇథనాల్ తయారు చేయనున్న కారణంగా ఎలాంటి కాలుష్య సమస్య ఉండదని అలాగే పరిశ్రమ నిర్వహణ కారణంగా దుర్వాసన కూడా వెలువడదని యాజమాన్యం చెబుతోంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఏర్పడబోవని స్పష్టం చేస్తోంది. ఈ ప్రాంతంలో సాగయ్యే మొక్కజొన్న, వరి పంటలను ప్రభుత్వ మద్దతు ధరకే తాము కొనుగోలు చేస్తామని నాణ్యతను సైతం పెద్దగా పరిగణలోకి తీసుకోమని ఆ కంపెనీ యాజమాన్యం వివరిస్తోంది. కాగా పరిశ్రమ నిర్వహణలో వెలువడే వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు కూడా పరిశ్రమలో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని, రివర్స్‌ట్యాంక్ పద్దతిలో ఈ సేంద్రియ ఎరువులను తయారు చేస్తామని స్పష్టం చేస్తోంది. ఇథనాల్ తయారీలో ఉపయోగించే మొక్కజొన్న వ్యర్థాలను పశువులకు దాణాగా తయారు చేస్తామని, అలాగే వరి ద్వారా వెలువడే వ్యర్థాలను నూకలుగా మారుస్తామని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. చెరుకుతో తయారు చేసే ఇథనాల్ పరిశ్రమ ద్వారా కాలుష్యం ఏర్పడుతుందని తాము కేవలం మొక్కజొన్న, వరితోనే ఇథనాల్‌ను తయారు చేస్తున్నందున కాలుష్యం సమస్య ఏర్పడబోదని పేర్కొంటున్నారు.



మల్లన్నస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

## ఘనంగా మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద, జనవరి 3 : మండలంలోని బాబాపూర్ గ్రామంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న మల్లన్నస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా ముగిసింది. స్వామివారి యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ దాత అయినటువంటి ప్రముఖ హోమియోపతి వైద్యులు రవికిరణ్, బాబాపూర్ సర్పంచ్ కొమ్ము శ్రీవిద్య, కనకాపూర్ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అయోధ్య అక్షింతలకు మంగళహారతులతో స్వాగతం



మండల కేంద్రంలో ఇంటింటికీ అక్షింతలను అందజేస్తున్న భక్తులు

నర్సాపూర్ (జి), జనవరి 03 : నర్సాపూర్ (జి) మండలం కేంద్రంలోని రామాలయానికి బుధవారం అయోధ్యలో రామయ్యకు పూజించిన అక్షింతలు చేరుకున్నాయి. అయితే గ్రామ ప్రజలు, మహిళలు మంగళ హారతులతో అక్షింతలకు స్వాగతం పలికారు. గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. అయోధ్య రామ జన్మష్టమి క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల రామునికి పూజించబడిన అక్షింతలు మొదట నర్సాపూర్ జి మండల కేంద్రానికి చేరుకున్నాయి. ప్రతి ఇంటికి అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయోధ్య రామ మందిరం జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, బర్కుంట నరెందర్, ప్రవీన్, సుభాష్, గంగారెడ్డి, రాంనాథ్, విట్టల్‌రెడ్డి,గంగారాం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెంబికి చేరిన అక్షింతలు

పెంబి, జనవరి 3 : ఈ నెల 22న అయోధ్యలో ఆది పురుషుడు భవ్య రాముని మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వచ్చిన అక్షింతలను మండల కేంద్రంలో బుధవారం మహిళలు, గ్రామస్థులు డోలు వాయిద్యాలతో ఊరేగింపు చేసి, ప్రతి ఇంటికి అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్ గౌడ్, గ్రామస్తులు పుప్పాల నర్సయ్య, సురేష్, తదితరులు న్నారు.

## ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- ఒక వ్యాపారి నుంచి మత్తు పదార్థాలు కొనుగోలు చేసినట్లు అనుమానం

లోకేశ్వరం, జనవరి 3 : లోకేశ్వరం మండలానికి చెందిన ఇద్దరు యువకులను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. లోకేశ్వరం మండలంలోని గడ్‌చందా గ్రామానికి చెందిన ఒకరు, పిప్రి గ్రామానికి చెందిన మరొకరిని హైదరాబాద్ నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారులు తీసుకెళ్లారు. వారిని అదుపులోకి తీసుకున్న వెంటనే లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఇక్కడి అధికారుల అనుమతితో వెంట తీసుకువెళ్లినట్లు తెలిసింది. వీరు ఒక వ్యాపారి నుండి మత్తు పదార్థాలు కొనుగోలు చేసినట్లు సమాచారం. వీరు కొనుగోలు చేసిన మత్తు పదార్థాలను ఇంకా ఎవరికైనా విక్రయించారా మరింత సమాచారం రాబట్టేందుకు అధికారులు ఈ యువకులను వెంట తీసుకువెళ్లినట్లు సమాచారం.

# ట్రిపుల్ ఐటీని సందర్శించిన జిల్లా కలెక్టర్



ట్రిపుల్ ఐటీలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

బాసర, జనవరి, 3: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించారు. వివిధ విభాగాల అధిపతులతో వైస్ చాన్సలర్ వెంకట రమణ, డైరెక్టర్ సతీష్‌కుమార్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. విద్య బోధన, విద్యార్థుల వసతి సౌకర్యాలు, పరిష్కారం లభించని సమస్యల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అంతా తిరిగి జిల్లా కలెక్టర్ యూనివర్సిటీని పరిశీలించారు.

### అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్

బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఖత్‌గాంలో అభయహస్తం దరఖాస్తుల పరిశీలన

భైంసా రూరల్, జనవరి 3 : మండలంలోని ఖత్‌గాం గ్రామంలో బుధవారం అభయహస్తం దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో మోజాం హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన టీజీవో నాయకులు

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : జిల్లా గజిటెడ్ ఉద్యోగుల సంఘ నాయకులు బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిసి మొక్కను అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులను అభినందించారు. కష్టపడి పని చేసి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్షుడు ఎం. మోహన్, ప్రధాన కార్యదర్శి పీజీ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న టీజీవో ప్రతినిధులు

# గ్రామసభను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఎల్. కిషోర్

లక్ష్మణచాంద, జనవరి 3 : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ప్రజా పాలన గ్రామ సభలను అడిషనల్ కలెక్టర్ ఎల్. కిషోర్ బుధవారం పరిశీలించారు. అలాగే పలువురు ఇచ్చిన అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ శ్యామ్ రావ్ రాథోడ్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీవో నసీరుద్దీన్, స్థానిక సర్పంచ్ అడిచెర్ల రవి కుమార్, నాయకులు కేశం రమేష్, ద్యావతి ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- ధర్నా అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్‌లో వివిధ భాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సానిటరీ, ఇంజనీరింగ్, నీటిపారుదల విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు, డ్రైవర్లకు గత రెండు నెలలుగా వేతనాలు అందడం లేదని, పీఎఫ్ ఎనిమిది నెలలుగా జమ చేయడం లేదన్నారు. పీఆర్సీ సగం మంది కార్మికులకు అందడం లేదన్నారు. కొత్తగా నియమించబడ్డ కార్మికులు, డ్రైవర్లకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐలో చోటు చేసుకున్న తప్పులు సవరించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించడంతో పాటు సమస్యలు వారంలోగా పరిష్కరించాలని లేనట్టయితే విధులు బహిష్కరిస్తామని హెచ్చరిక చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు అందజేశారు. నాయకులు ఫయాజ్, వంశీ, రాహుల్, రమేష్, ముత్యం, పురుషోత్తం, ముక్రం, కృష్ణ, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో బీఆర్ఎస్ లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశం

- హాజరైన జిల్లా నేతలు




మాజీ మంత్రి ఐకే రెడ్డి, నాయకులు

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : రాబోయే లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశం బీఆర్ఎస్ పార్టీ బుధవారం తెలంగాణ భవన్ హైదరాబాద్‌లో నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి నిర్మల్ జిల్లా నుండి మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీలు, పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు జడ్పీ చైర్ పర్సన్ కే. విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జి హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారని ఐకేరెడ్డి తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వ్యూహాలపై చర్చించినట్టు సమాచారం.

## నేడు యాసంగి పంట కోసం సదర్మాట్ ఆయకట్టుకు నీటి విడుదల

- నీటిని వృథా చేయొద్దని అధికారుల సూచన



సదర్మాట్ ఆనకట్ట (ఫైల్)

ఖానాపూర్, జనవరి 3 : యాసంగి పంట కోసం ఖానాపూర్, కడెం మండలాల రైతులకు జీవనాదారమైన సదర్మాట్ ఆనకట్ట నుంచి ఆయకట్టుకు నేడు నీటి విడుదల చేయనున్నట్లు ఎస్ఆర్ఎస్‌పీ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు నీటి పారుదలశాఖ ఎస్ఈ డి.సుశీల్‌కుమార్, ఈఈ రామారావులు బుధవారం ప్రకటన విడుదల చేసినట్లు స్థానిక సదర్మాట్ ఉదయ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా నీటి విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టులో గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం నీటి నిల్వ తక్కువగా ఉన్నందున రానున్న యాసంగి పంటకు విడుదల చేస్తున్న నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా వీలైనంత త్వరగా పంటలు వేసుకోవాలని సూచించారు.

## విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : మరమ్మతుల దృష్ట్యా గురువారం దివ్యనగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు జరుగుతున్నాయని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచాలి



లింబా (కే) హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రవీంధర్‌రెడ్డి

కుంటాల, జనవరి, 3 : పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డీఈవో రవీంధర్‌రెడ్డి అన్నారు. బుధవారం కుంటాల మండలంలోని లింబా (కే) పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రుల ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. పదవతరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్న దృష్ట్యా వాటిని సద్వినియోగ పరుచుకొని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో నర్సయ్య, హెచ్ఎంలు నర్సయ్య, అంబకంటి సతీష్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నిర్మల్ కల్చరల్, జనవరి 3 : నిర్మల్‌లోని విన్నర్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై సైబర్‌క్రైమ్ విభాగం ఇన్‌చార్జి ఎస్సై పి. రవి అవగాహన కల్పించారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.